
కాల్వశ్రీరాంపూర్: తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువత


జూలపల్లి: తేలుకుంటలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ మహిళలు


ముత్తారం: ఓటేయడానికి వాగు దాటి వస్తున్న శాత్రాజుపల్లి గిరిజనులు


ఎలిగేడు మండలం ధూళికట్టలో బారులు తీరిన ఓటర్లు


మంథని: సాయంత్రం 4గంటలు దాటాక క్యూలో ఉన్న సూరయ్యపల్లివాసులు

సజావుగా ‘సాధారణ’ పోరు

జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో చెదురుమదురు ఘటనలు మినహా మిగతా నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అక్కడక్కడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ సమయం కాగా ఏడు దాటినా కొన్ని కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. దీంతో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించారు. చాలా కేంద్రాల్లో ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడం, అధికారులు సైతం అలసత్వంగా పనిచేయడంతో ఓటు వేయడానికి ఓటర్లు గంటల తరబడి నిలబడ్డారు. వృద్ధులు, పేషెంట్లను వీల్‌చైర్లపై పోలీసులు, స్థానిక పంచాయతీ సిబ్బంది పోలింగ్ స్టేషన్‌కు తరలించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్, సీపీ రెమా రాజేశ్వరి, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. - సాక్షి నెట్‌వర్క్


రామగుండం: పోలింగ్ సరళని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు


ఫర్టిలైజర్‌సిటీ: వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న వలంటీర్లు


పాలకుర్తి: ఓటుహక్కు వినియోగించుకున్న ఐఏఎస్ నరహరి దంపతులు



సుల్తానాబాద్: ఓటర్ లిస్టులో తమ పేరును చూసుకుంటున్న ఓటర్లు


పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలలో..


ఓదెల: మడకలో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సిబ్బంది


ధర్మారం: దివ్యాంగురాలిని తీసుకువస్తున్న తండ్రి


పెద్దపల్లిరూరల్: తల్లి వెంకటమ్మతో కలిసి వచ్చి ఓటేసిన తనయుడు వెంకటేశం


సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న జనం


రామగిరి: లొంకకేసారంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఈవీఎంలు తరలిస్తున్న సిబ్బంది


జ్యోతినగర్: న్యూపీకే రామయ్యకాలనీలో క్యూలో నిల్చున్న ఓటర్లు

ఉత్సాహంగా తొలి ఓటు

- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటువేసిన యువత

పెద్దపల్లిరూరల్/రామగుండం/సుల్తానాబాద్/కోల్‌సిటీ/ఫర్టిలైజర్‌సిటీ: కొత్తగా ఓటుహక్కు పొందిన యువత గురువారం తొలి ఓటు సంబురాన్ని జరుపుకున్నారు. పలువురు విద్యార్థులు తమ తొలి ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రం బయట ఫొటో దిగారు. ‘నేను ఓటు వేశాను.. మరి మీరు వేశారా?’ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వారి సంబురాన్ని ‘సాక్షి’తో పంచుకున్నారు.


ముత్తారం: ఓటు వేసిన యువత

అవినీతిరహిత పాలనకే ఓటు



ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నూతనంగా ప్రవేశపెట్టే అన్నిరంగాల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వ పనితీరు ఆధారంగా బరిలో ఉండే పార్టీలను ఓటువేసి బలపరచాలి. విద్యావంతులైన ప్రజాప్రతినిధులను ప్రోత్సహిస్తూ అవినీతిరహిత పాలన జరిగేలా చూడాలి. - అక్షరగీత, పెద్దంపేట, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

డబ్బు ప్రభావం నిర్మూలించాలి



ప్రతి ఎన్నికల్లో ధన బలానికి ఆస్కారం లేకుండా అవినీతి రహిత పాలనతో పాటు విద్యావంతుడైన అభ్యర్థిని ఓటు వేసి ఎన్నుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి అన్ని మతాలు, కులాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ పరిపాలన చేపట్టాలి.
- కుడుముల శివాణి, రామగుండం, ఇంజనీరింగ్ విద్యార్థిని

చాలా హ్యాపీగా ఉంది



తొలి ఓటును వినియోగించుకోవడం చాలా హ్యాపీగా ఉంది. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న. రేపు ఎగ్జామ్ కూడా ఉంది. కానీ తొలి ఓటు వేయడానికి హైదరాబాద్ నుంచి వచ్చాను. చాలా మంది యువత ఓటుకు దూరంగా ఉండడం బాధాకరం. - క్యాతిరిన్, డిగ్రీ, గోదావరిఖని

తమ్ముడితో కలిసి..



తొలిసారిగా ఇద్దరం కలిసి ఓటు వేయడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో నేను బీటెక్, తమ్ముడు ఇంటర్ చదువుతున్నాం. ఓటు వేయడానికి గోదావరిఖనికి వచ్చాం. వినియోగించుకున్న ఓటుహక్కు సంతోషాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాం.
- రిషిత్, వర్షిత్, సోదరులు, గోదావరిఖని

విద్యావంతులకే ఓటు



ఎన్నికల్లో అభ్యర్థి గుణగణాలు, పోలీసు కేసులు, విద్యావంతుడు తదితర అంశాలను పరిశీలించకుండా కేవలం ఆస్తులు, నియోజకవర్గాన్ని శాసించే సత్తా ఉందా అనే విధంగా ఆలోచించి బరిలో నిలుపుతున్నారు. ఈ విధానానికి స్వస్తిపలికి విద్యావంతుడు, అవినీతిరహితుడుగా ముద్ర ఉన్న వ్యక్తులను గుర్తించి బరిలో ఉంచాలి.
- అనన్య, సుభాష్‌నగర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ఓటును అమ్ముకోవద్దు



గెలిచాక పేదల సంక్షేమం కోసం అహర్నిషలూ పనిచేసే నాయకుడికి ఓటు వేశాం. ఓటును అమ్ముకుంటే మంచి నాయకుడిని కోల్పోతాం. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నాం. మొదటిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. - మొగిళి అనూష, మండల రాణి, అడవిశ్రీరాంపూర్

తొలిసారి ఓటు వేసిన



తొలిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. యువతకు ఉపాధి కల్పించే వారికి అండగా నిలవాలని ఓటు హక్కును వినియోగించుకున్న.
- వైష్ణవి, పూసాలరోడ్డు, సుల్తానాబాద్

సేవచేసే వారికి..



నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే నాయకుడు ఉండాలని వారికే ఓటు వేశా. మా తల్లిదండ్రులు ఓటు వేసేటప్పుడు చెప్తూ ఉండే వారు. నా ఓటును నిస్వార్థంగా సేవ చేసే నాయకుడికి ఓటు వేసినందుకు గర్వపడుతున్న.
- బైరగోని అనన్య, గౌడకాలనీ, సుల్తానాబాద్

హైద్రాబాద్ నుంచి వచ్చిన



అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాదు నుంచి స్వగ్రామం పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి వచ్చిన. రాజ్యాంగం కల్పించిన హక్కుతో తొలిసారిగా నేను ఓటు హక్కును వినియోగించుకున్నాను.
- పల్లె నిఖిత, ఎల్కలపల్లి

గర్వంగా ఉంది



అసెంబ్లీ ఎన్నికల్లో తొలి ఓటు వేయడం చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే ప్రతి ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.
- పానగంటి నిశ్చల, రంగంపల్లి

న్యాయం చేసేవారికే ఓటువేశాను



మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు, పేదలకు, రైతులకు న్యాయం జరుగుతుందో ఆ పార్టీ నాయకుడికి ఓటు వేశాను.
- వీరగోని అశ్విని, బీటెక్, అడవిశ్రీరాంపూర్

ఓటు వేయలేకపోయిన కాంగ్రెస్ యువత అధ్యక్షుడు



బయటకు తీసుకొస్తున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పోలింగ్ స్టేషన్‌లో కాంగ్రెస్ యువత అధ్యక్షుడు సాన్నాయిటెంకం శివరామకృష్ణ ఓటు వినియోగిచుకోలేక పోయాడు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో 116, 117, 118 బూతులు ఏర్పాటు చేశారు. ఐదు గంటల తర్వాత పోలింగ్ స్టేషన్ గేటు వేశారు. అప్పటికే పోలింగ్ స్టేషన్ ఆవరణలో ఉన్న శివరామకృష్ణ మంచినీటి కోసం బయటకు వెళ్లానని, తాను వచ్చేవరకు వేచి చూడకుండా అధికారులు ఈవీఎంలు క్లోజ్ చేశారన్నారు. తనకు ఓటువేసే అవకాశం ఇవ్వాలని కోరాడు. సీల్ వేశాక తిరిగి తెరవడం సాధ్యం కాదని అధికారులు తేల్చి చెప్పారు. తమతప్పేమీ లేదని సమయం ముగిసిందని క్లోజ్ చేశామని ప్రిసైడింగ్ అధికారులు తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్ నచ్చచెప్పి శివరామకృష్ణను శాంతింపజేశారు.

మొరాయించిన వీవీప్యాట్

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఓ వీవీ ప్యాడ్ మొరాయించింది. దీంతో కొత్త వీవీప్యాట్‌ను పోలింగ్ అధికారులు అమర్చారు. నియోజకవర్గంలో గురువారం శాసనసభకు జరుగుతున్న ఎన్నికల నిర్వహణ కోసం, పోలింగ్ సిబ్బంది స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలోని 95వ పోలింగ్ బూత్ నంబర్‌లో పోలింగ్ ప్రారంభించారు. మధ్యాహ్నం ఈ పోలింగ్ కేంద్రంలో ఓ మహిళా ఓటరు ఓటు వేయగా, సౌండ్ రాకపోవడంతో వీవీప్యాట్‌లో సాంకేతికలోపం ఉన్నట్లు గుర్తించారు. గంటపాటు పోలింగ్ నిలిచింది. పోలింగ్ బూత్ లెవల్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు కొత్త వీవీప్యాట్ అమర్చారు. గంటసేపు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గర్రెపల్లిలో కాంగ్రెస్ నాయకుల ఆందోళన

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలోని పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారి అధికార పార్టీకి ఓటు వేయాలని మహిళలకు చెప్పారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు పోలీసు అధికారితో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ పరిస్థితి గందరగోళంగా మారడంతో ఎస్సైలు విజేందర్, వినీత వారిని చెదరగొట్టారు. పోలీస్ అధికారి అధికార పార్టీకి మద్దతు ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

కాట్నపల్లిలో 6:30వరకు జరిగిన పోలింగ్..

సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో సాయింత్రం 6:30గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎస్సీ, బీసీ కాలనీ మహిళలు ఓ పార్టీ వాళ్ల డబ్బులు వచ్చిన పంచలేదని, వారి వద్దనే ఎందుకు ఉంచుకోవాలని డిమాండ్ చేస్తు మధ్యాహ్నం వరకు ఓటు వేసేందుకు నిరాకరించారు. దీంతో కొందరు నాయకులు మహిళలకు నచ్చజెప్పడంతో సాయంత్రం 4గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.


జనాన్ని చెదరగొడుతున్న పోలీసులు

పెళ్లి మండపంలా పోలింగ్ కేంద్రం

- నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రంగా గుర్తింపు

రామగుండం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామంలో ఉన్న బూత్ నెం.13 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ (ఆదర్శ) పోలింగ్ కేంద్రంగా గుర్తించారు. కాగా గురువారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులుగా సదరు పోలింగ్ కేంద్రాన్ని పెళ్లి రిసెప్షన్‌గా తీర్చిదిద్దారు. స్వాగత తోరణాలు, పైన సీలింగ్‌కు బెలూన్స్, మామిడి ఆకుల తోరణాలు, ఇరువైపులా పూలకుండీలు, కింద నేలపై ఆకుపచ్చ కార్పెట్, ఇరువైపులా సైడ్ కర్టెన్‌లు ఏర్పాటు చేశారు. దానిపై రామునిగుండాల ఫొటోలు చిత్రీకరించడం ప్రతీ ఓటరును ఆకర్షించింది. ఓటింగ్ శాతం పెంచేందుకు, ఓటర్లను ప్రోత్సహించేందుకు నియోజకవర్గంలో ఒక కేంద్రాన్ని మోడల్ (ఆదర్శ) కేంద్రంగా గుర్తించామన్నారు. ఇందులో భాగంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. కాగా మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై మండల కేంద్రంలో ప్రతి ఒక్క ఓటరు ఆసక్తిగా చర్చించారు.


ప్రవేశ ముఖద్వారం

ఓటరులిస్టులో పేర్లు గల్లంతు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్‌లిస్టులో పేర్లు గల్లంతు కావడంతో ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. అధికారుల తప్పిదమా?.కంప్యూటర్ పొరపాటా? తెలియదు కానీ పలువురు తమ ఓటు వినియోగించుకోలేక పోయామని వాపోయారు. గంగారంలో వృద్ధురాలు అనసూర్య, మురళీకృష్ణ పేరు గల్లంతు అయిందని వాపోయాడు.

మూలమలుపు వద్ద భారీ గుంత



సుల్తానాబాద్: పట్టణంలోని మసీద్ ఎదుట మూలమలుపు వద్ద భారీ గుంత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్డును పరిశీలన చేసిగుంతను పుడ్చాలని అధికారులను కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.